సాక్షి
నిర్మల్
సోమవారం ¦ 23 ¦ డిసెంబర్ ¦ 2024



పరిశోధిస్తే ఫలితాలెన్నో..
కవ్వాల్ టైగర్‌జోన్ అరుదైన జీవజాతులకు నిలయం. గతంలో అరుదైన కప్పను చూపించిన ఈ ప్రాంతం తాజాగా పటిల్ కాక్ మష్రూమ్‌లను పరిచయం చేసింది. 8లో▸



కనుల పండువగా ఆరట్టు
జిల్లాలోని పలు ప్రాంతాల్లో అయ్యప్ప ఆరట్టును ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 / 18.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. చలి కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జాగిలాలతో తనిఖీలు



జాగిలాలతో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడలో గల డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఆదివారం డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించే, విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై సాయికుమార్, యాంటీ నార్కోటిక్ డాగ్ టీం మహిపాల్, సాయన్న, కిరణ్, రెహమాన్, ప్రణీత్, సిబ్బంది పాల్గొన్నారు.

అడెల్లిలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు పొరుగు జిల్లాలు ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు.

ఎలక్ట్రిసిటీ ఎస్టీ జిల్లా కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: ఎలక్ట్రిసిటీ ఎస్టీ అసోసియేషన్ జిల్లా సర్వసభ సమావేశంలో ఏడీఈ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అంబాజీనాయక్, కార్యదర్శిగా మురళి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలయ్య, ట్రెజరర్‌గా వాగోజిని ఎన్నుకున్నారు.



నర్సింగ్ కళాశాల నిర్వహిస్తున్న పీజీ కళాశాల భవనం

ఆన్‌లైన్‌లోనే బోధన

- పీజీ కళాశాల భవనంలోనే నర్సింగ్ కళాశాల నిర్వహణ
- శాశ్వత భవనానికి చర్యలు
- స్థల సేకరణలో అధికారులు
- ఫస్టియర్‌లో 60 సీట్లు భర్తీ
- నర్సింగ్ ఆఫీసర్లతోనే పాఠాలు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌కు మంజూరైన ప్రభుత్వ మహిళా నర్సింగ్ కాలేజీని సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 2న వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. కళాశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక హాస్టల్, తరగతుల నిర్వహణకు జాప్యం జరుగుతోంది. 20 రోజులుగా నర్సింగ్ ఆఫీసర్లతో ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు తమ ఇళ్లలోనే ఉండి ఆన్‌లైన్ క్లాసులు వింటున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓరియంటేషన్ క్లాసుల ద్వారా ఫ్యాకల్టీలు తొలి సెమిస్టర్‌లోని అంశాలను బోధిస్తున్నారు. ప్రిన్సిపాల్ శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ మంజుల బోధన తీరును పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో కాలేజీకి అవసరమైన ఏర్పాట్లు, వసతుల కల్పనపై చర్యలు తీసుకుంటున్నారు.

నర్సింగ్ ఆఫీసర్లతో తరగతులు

నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో విధులు నిర్వహిస్తున్న ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఆరుగురు నర్సింగ్ ఆఫీసర్లతో విద్యార్థినులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేయిస్తున్నారు. వారితోపాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కూడా పాఠాలు చెబుతున్నారు. నిర్మల్ నర్సింగ్ కాలేజీలో చేరిన 60 మందిలో జిల్లాతోపాటు హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, మంచిర్యాల తదితర ప్రాంతాలకు చెందిన వారున్నారు. వీరందరికీ కాలేజీతోపాటు వసతి, సౌకర్యాల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి.



కళాశాలలో ఆన్‌లైన్‌లో విద్యార్థినులకు బోధిస్తున్న నర్సింగ్ ఆఫీసర్ (ఫైల్)

కొనసాగుతున్న తాత్కాలిక ఏర్పాట్లు

కాలేజీతోపాటు హాస్టల్ నిర్వహణకు పక్కా భవనం లేక పీజీ కళాశాల భవనాన్ని తాత్కాలికంగా ఉపయోగిస్తున్నారు. అవసరమైన ఫర్నిచర్ భవనంలోని గదుల్లో ఏర్పాటు చేసినా.. పూర్తిస్థాయిలో సౌకర్యాలు సమకూర్చే పనులు ఇంకాపూర్తి కాలేదు. దీంతో హాస్టల్, తరగతుల నిర్వహణకు ఆలస్యమవుతోంది. తొలి సెమిస్టర్ సిలబస్ సకాలంలో పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు.

పూర్తికాని ఉద్యోగుల నియామకం

నర్సింగ్ కాలేజీలో ఉద్యోగుల నియామక ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. నర్సింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను మాత్రమే నియమించారు. మిగతా ఫ్యాకల్టీతోపాటు అవసరమైన పూర్తిస్థాయి కార్యాలయ, సెక్యూరిటీ సిబ్బందిని నియమించలేదు. ఇందుకు సంబంధించిన జీవో ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ విడుదల కాలేదు.

కొలిక్కిరాని స్థల సేకరణ

నర్సింగ్ కాలేజీ కోసం పక్కా భవన నిర్మాణంతో పాటు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చడానికి రూ.26 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. కాగా, కాలేజీ నిర్వహణ కోసం మాత్రం ఇప్పటివరకు బడ్జెట్ విడుదల కానట్లు తెలిసింది. మరోవైపు అనుకూలమైన స్థలం కోసం అధికారులు పరిశీలన చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కురన్నపేట్ సీతాసాగర్ చెరువులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ -422, విశ్వనాథ్‌పేటలోని సర్వే నంబర్ -199లో గల ప్రభుత్వ భూమి, స్థానిక డిగ్రీ కాలేజీ ప్రాంగణంలోని ప్రభుత్వ భూమిని ఇటీవల పలువురు అధికారులు పరిశీలించారు. కానీ, స్థల సేకరణపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు.

ఆన్‌లైన్‌లోనే బోధిస్తున్నాం



నిర్మల్ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో సౌకర్యాల కల్పన శరవేగంగా సాగుతోంది. పనులు పూర్తి కావడానికి కొంతసమయం పడుతుంది. అందుకే తొలి సెమిస్టర్ క్లాసులను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం. ఇందుకోసం నర్సింగ్ ఆఫీసర్లతో విద్యాబోధన చేయిస్తున్నాం. మిగతా ఉద్యోగులు, సిబ్బంది నియామకానికి ప్రభుత్వం నుంచి జీవో రావాల్సి ఉంది.

– శకుంతల, నర్సింగ్ కళాశాల, ప్రిన్సిపాల్

సాదాబైనామాలపై ఆశలు

- తెలంగాణ భూభారతితో మోక్షం
- పదేళ్ల నిరీక్షణకు తెర పడేనా..?
- జిల్లాలో 7,472 దరఖాస్తులు
- అమల్లోకి ఆర్వోఆర్–24 చట్టం

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్: సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతుల ఆశలు నెరవేరనున్నాయి. సాదాబైనామాల భూములకు సంబంధించి రికార్డుల లేకపోవడం, పట్టాదారులుగా గుర్తించలేని పరిస్థితులు నెలకొనడం లాంటి కారణాలతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు నోచుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన తెలంగాణ భూభారతి బిల్లు–2024తో వారి నిరీక్షణకు తెరపడే అవకాశాలున్నాయి. శాసనసభలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం–2024 బిల్లుతో జిల్లాలో 7,472 మంది సాదాబైనామాలకు సంబంధించిన ఇబ్బందులు తొలగనున్నాయి.

ధరణిలో కనిపించని ఆప్షన్లు

గత ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ తీసుకువచ్చి దాని ద్వారానే భూ నిర్వహణను కొనసాగించింది. అయితే ధరణిలో అన్ని రకాల ఆప్షన్లు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. అందులో సాదాబైనామాలు కూడా ఒకటి. ధరణిలో సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం ఆప్షన్లు లేక చాలామంది గత ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న అప్పటి ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారానికి చర్యలు చేపడతామని మూడేళ్ల కిందటే దరఖాస్తులు స్వీకరించినా నిరాశే ఎదురైంది.

అందనున్న పథకాలు

భూ భారతి చట్టం అమలులలోకి వస్తే తెల్ల కాగితాలపై భూములు కొనుగోలు చేసిన రైతులకు ఇక భూహక్కు వర్తించనుంది. క్షేత్రస్థాయిలో సాగు చేసుకుంటున్నప్పటికీ రికార్డుల్లో వారి పేర్లు లేవు. దీంతో వారికి రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు వర్తించలేదు. రికార్డుల్లో వారికి భూమి విక్రయించిన వారి పేర్లు ఉండటంతో యాజమాన్య హక్కులు లేకుండా పోయాయి. దీంతోపాటు క్షేత్రస్థాయిలో భూములు విక్రయించిన వారసులతో ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని సంఘటనలు పోలీస్ ఠాణాల వరకు వెళ్లాయి. అసలు పట్టాదారుకు సంబంధించిన వారసులు, సంబంధీకులు తెల్ల కాగితాలు, బాండు పేపర్లపై భూములు కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి భూములు తీసుకోవడానికి ప్రయత్నించారు. వ్యవసాయ భూములు స్థిరాస్తి వ్యాపారానికి అనుకూలంగా మారిన ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చట్టం అమల్లోకి తెస్తే ఈ సమస్యలకు పరిష్కారం దొరకనుంది.



ఏళ్లుగా ఎదురుచూపు

సాదాబైనామా సమస్యను పరిష్కరించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసింది. దీంతో ఆయా దరఖాస్తుదారులంతా సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కొత్తగా భూభారతి ఆర్వోఆర్ చట్టం -2024ను తీసుకువస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. త్వరలోనే ఈ చట్టం అమల్లోకి రానుంది. దీంతో సాదాబైనామా సమస్య పరిష్కారం కానుంది.

మండలాల వారీగా సాదాబైనామాకు వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తుల సంఖ్య
బాసర	57
భైంసా	172
దస్తురాబాద్	789
దిలావర్‌పూర్	572
కడెం–పెద్దూర్	879
ఖానాపూర్	323
కుభీర్	576
కుంటాల	273
లక్ష్మణచాంద	569
లోకేశ్వరం	669
మామడ	1,042
ముధోల్	640
నర్సాపూర్ (జి)	245
నిర్మల్ అర్బన్	36
నిర్మల్‌రూరల్	460
పెంబి	68
సారంగపూర్	561
సోన్	280
తానూరు	63

2024 నవంబర్ 13న మంచిర్యాల వడ్డెర కాలనీకి చెందిన రాజేందర్ అదే కాలనీకి చెందిన 11 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి హైటెక్ సిటీ సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. భయభ్రాంతులకు గురైన బాలిక తప్పించుకుని వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో ఈ ఏడాది డిసెంబర్ 21న ఓ యువకుడు మద్యం మత్తులో 12 ఏళ్ల బాలికను మూడు గంటలపాటు నిర్బంధించాడు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చట్ల పోశెట్టి(25) మధ్యాహ్నం 3 గంటల సమయంలో కాలనీకి చెందిన బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేశాడు. అతడు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు దిగారు. అతడిని అప్పగించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం నిందితుడి ఇంటిని దహనం చేశారు. కాగా, నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

పిల్లలపై పైశాచికం!

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. 2024, సెప్టెంబర్ 27న విద్యార్థిని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన బొమ్మెన సాగర్ మద్యం మత్తులో ఇంట్లోకి ఎత్తుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.



- ఆగని మృగాళ్ల అఘాయిత్యాలు
- కఠిన చట్టాలున్నా మారని కామాంధుల తీరు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు
- ఠాణాకు రాని సంఘటనలు అనేకం..
- అప్రమత్తత, అవగాహన అవసరమంటున్న నిపుణులు

ఉమ్మడి జిల్లాలో రెండేళ్లలో నమోదైన పోక్సో కేసులు

సంవత్సరం	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	కుమురంభీం
2023	52	40	20	21
2024	40	45	26	16

మంచిర్యాలక్రైం: గంజాయి, మద్యం మత్తులో కామాంధులు వావి వరసలు మర్చిపోతున్నారు. పిల్లలు, వృద్ధులు అని కూడా చూడకుండా పైశాచికానికి ఒడిగడుతున్నారు. ఆడది అయితే చాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. బాలికలు, మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కామాంధుల తీరు మారడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. కొంతమంది బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా, చాలామంది అవమానభారంతో గ్రామాల్లోనే పంచాయితీలు, జరిమానాలతో బయటకు రాకుండా చేస్తున్నారు.

బయటకు రాని ఘటనలెన్నో...

ఉమ్మడి జిల్లాలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. వీటిలో కొన్ని వెంటనే వెలుగులోకి వస్తుండగా.. మరికొన్ని ఇతర కేసుల విచారణ సమయంలోనో.. లేక బాధితులు అనారోగ్యానికి గురైనప్పుడో వెలుగుచూస్తున్నాయి. ఇక పరువు పోతుందన్న భయంతో కొందరు తల్లిదండ్రులు ఇలాంటి సంఘటనలను దాచిపెడుతున్నారు. నిందితులు తెలిసిన వారై ఉండటం, పోలీసుల దృష్టికి తీసుకెళ్తే బయటకు వచ్చాక మళ్లీ వేధిస్తారన్న భయంతో చాలామంది ఫిర్యాదు చేయడం లేదు. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన చిరు వ్యాపారి కూతురును తన దగ్గరి బంధువే ఐస్‌క్రీమ్ పార్లర్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని దాచి ఉంచారు.

తల్లిదండ్రుల బాధ్యత...

ఎవరైనా ప్రేమగా మాట్లాడినా, ఆటలు ఆడినా.. చిన్నారులు వారి దగ్గరకు వెళ్తారు. అందరూ మంచివారే.. అందరూ మనవారే అన్న భావనలో ఉంటారు. అయితే మంచితనం ముసుగులో కొందరు పిల్లలపై లైంగిక దాడులకు తెగబడుతున్నారు. చుట్టూ ఉన్నవారు.. బంధువులు.. బాగా తెలిసిన వారే ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రతీ సందర్భంలో పిల్లలను కనిపెట్టుకుని ఉండడం సాధ్యం కాదు. పిల్లలకు వారి శరీరంలో మార్పులను బట్టి తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో జాగ్రత్తలు వహించాలని వైద్యులు, పోలీసులు, మానసిక నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల ప్రవర్తనలో ఏదైనా మార్పు వస్తే గమనించి, కారణాలను తెలుసుకోవాలంటున్నారు. ఇంట్లో మగ పిల్లలు అయితే తోటి పిల్లలతో, ముఖ్యంగా తమ చుట్టూ ఉన్న మహిళలు, బాలికలను ఏవిధంగా గౌరవించాలో నేర్పించాలని.. బాలికలకైతే తమ శరీరాన్ని ఎవరైనా తాకడానికి ప్రయత్నిస్తే ఏం చేయాలో నేర్పించాలని పేర్కొంటున్నారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలంటున్నారు. పిల్లలతో సమయం గడుపుతూ వారు చెప్పే విషయాలను స్నేహితులుగా శ్రద్ధగా వినాలని సూచిస్తున్నారు. పోలీస్, న్యాయశాఖ ద్వారా కూడా షీటీం బాలికల భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

మైనర్లను లైంగికంగా వేధిస్తే..

లైంగికదాడుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టానికి 2012లో ఆమోదం లభించింది. ఆ ఏడాది జూన్ 19న ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. జూన్ 20న గెజిట్‌లో నోటిఫై చేశారు. చట్టంలో పేర్కొన్న మేరకు బాలిక ఆమోదం తెలిపినా, తెలపక పోయినా 18 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడి జరిగితే అది నేరంగానే పరిగణించబడుతుంది. 16 ఏళ్లలోపు బాలిక ఆమోదం తెలిపినా, తెలుపకపోయినా లైంగికదాడిగానే పరిగణిస్తారు. కొత్త చట్టం, నిబంధనల ప్రకారం 18 ఏళ్లలోపు ఉన్న ఏ వ్యక్తికైనా ఇది వర్తిస్తుంది. నేరం రుజువైతే ఏడేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష, జరిమానా, లేదా జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. పిల్లలపై లైంగిక వేధింపులు, దాడి చేస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా, రెండోసారి అదే నేరం చేస్తే ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. కొన్ని కేసుల్లో జీవిత ఖైదు పడే అవకాశముంది.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే



పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే. వారి కదలికలు, దిన చర్యలో వారు ఏం చేస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు. వారి స్నేహితుల వివరాలు తల్లిదండ్రులకు తెలిసి ఉండాలి. ఎవరితో కూడా చనువుగా ఉండకుండా చూసుకోవాలి. సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పించాలి. పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీం ఉంది. డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారు.

– ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

బాధ్యతగా వ్యవహరించాలి



బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతీ పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. బాలికలపై లైంగిక దాడులు జరిగినప్పుడు ఫిర్యాదుకు వెనుకాడుతున్నారు. నిందితులకు భయపడి కొందరు ఫిర్యాదు చేయడం లేదు. కొందరు రాజీ పడుతున్నారు. దీంతో నేరస్తులు తప్పించుకుంటున్నారు. తప్పుచేసిన వారికి శిక్ష పడితేనే నేరాలు తగ్గుతాయి. లైంగికదాడికి గురైన బాలికకు ప్రభుత్వ పరిహారం కూడా అందిస్తుంది.

– రాంబాబ్, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, మంచిర్యాల

పొన్కల్ హైస్కూల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఎస్సీఈఆర్టీ (రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి) ఫర్ బెస్ట్ ప్రాక్టిసెస్ అవార్డు అభించింది. జిల్లాలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపుతో పాటు రాష్ట్ర అవార్డుకు నామినేట్ అయింది. పాఠశాలలో చదువుతో పాటు ఎన్‌సీసీ, పరీక్షల ఫలితాలు, సైన్స్‌ఫేర్‌కు సంబంధించి విద్యార్థుల సమగ్ర ప్రతిభను తెలిపే వివరాలను రాష్ట్రస్థాయికి పంపించారు. జిల్లాలో మస్కాపూర్ ఉన్నత పాఠశాల తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలలో 578 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత మూడేళ్లుగా పాఠశాల నుంచి పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది ఐదుగురు బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్ తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల చొరవతో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఐదు ఎగ్జిబిట్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. స్వాగత గీతం ప్రదర్శించిన విద్యార్థులు పలువురి ప్రశంసలు, బహుమతి అందుకున్నారు. పాఠశాలలో 578మంది విద్యార్థుల్లో 100మంది ఎన్‌సీసీ కెడెట్లుగా ఉన్నారు. మండలంలో నిర్వహించే జాతరలు, వివిధ కార్యక్రమాల్లో ఎన్‌సీసీ విద్యార్థులు చేపట్టే సామాజిక కార్యక్రమాలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ (ఫైల్)

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

సారంగపూర్: స్వర్ణ ఆయకట్టు కింద రబీలో పంటలు సాగుచేసే రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్ నుంచి ఆదివారం ఆయన సాగునీరు విడుదల చేశారు. అనంతరం సాగునీటి లభ్యత గురించి ప్రాజెక్ట్ ఏఈ మధుపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రాజెక్ట్ ఎడమ, కుడి, మధ్య (జౌళి నాలా) కాలువల ద్వారా విడుదల చేసిన సాగునీటిని పొదుపుగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకొస్తున్న కాంగ్రెస్ సర్కారు రైతులకు చేసిందేమీ లేదని ఆరోపించారు. రైతు భరోసాపై స్పష్టతనివ్వడంలేదని విమర్శించారు. వెంటనే రైతు భరోసా, పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హాదీ, నాయకులు విలాస్, రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, రాంనాథ్, తిరుమలాచారి, పోతన్న, భోజన్న, సాహెబ్‌రావు ఉన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్య దైవం శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అమ్మవార్లకు గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకీ సేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

బాధితులకు పరామర్శ


వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్ చెంచుకాలనీ సమీపంలో ఈ నెల 19న పోలీసులు వేధిస్తున్నారని నలుగురు యువకులు హెయిర్‌డై తాగి ఆత్మహత్యకు యత్నించిన సెల్ఫీ వీడియో విడుదల చేశారు. సమయానికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడంతో ఆరోగ్యం ఇంటికి తిరిగివెళ్లారు. విషయం తెలుసుకున్న మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం బాధితుల ఇళ్లకు వెళ్లి విషయం తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత నెల కేకే-1 గనిపై జరిగిన చోరీ కేసులో సెక్యూరిటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తొమ్మిది మంది పేరిట కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించారన్నారు. సదరు యువకులను పోలీసులు వేధించడం వల్లే మనస్తాపానికి గురయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా వారిపై వేధింపులు ఆపాలని, వారానికి రెండు రోజులు పోలీస్ స్టేషన్‌కు రావాలనే కండీషన్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘోత్తమరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పందిళ్ల రంజిత్‌కుమార్ ఉన్నారు.


గంజాయి పట్టివేత

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి వద్ద 62వ జాతీయ రహదారి మీదుగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం పట్టుకున్నట్లు సీఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా గమనించిన మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన ఆలం పున్నం పారిపోతుండగా పట్టుకున్నారు. అతని వద్ద తనిఖీ చేయగా 1,550 గ్రాముల గంజాయి లభించింది. ఇంటివద్దనే గంజాయి సాగు చేస్తున్న నిందితుడు చెన్నూర్‌లో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.38 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ బుజ్జిబాబు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ఎదులాపురం: తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీలలో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అఫియా సుల్తానా ప్రథమ స్థానంలో నిలిచి ఆదివారం అవార్డు అందుకుంది. ప్రథమ స్థానంలో నిలిచిన అఫియాను తెలంగాణ గణిత ఫోరం ఆదిలాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌రెడ్డి, పిల్లి కిషన్, బండి సుభాష్, తదితరులు అభినందించారు.

మిరపలో తెగుళ్ల బెడద


నెన్నెలలో ముడతకు వచ్చిన మిరపచెట్లు

- చలిగాలులతో పంటను ఆశిస్తున్న చీడలు
- జాగ్రత్తలు తీసుకుంటేనే దిగుబడులు


శ్రీధర్‌చౌహాన్, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 4,700 ఎకరాల్లో మిరప పంట సాగవుతోంది. చలిగాలులు, మంచు కారణంగా కాపు దశలో ఉన్న మిరప పంటను పలు రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్ క్రిముల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను సకాలంలో నివారిస్తేనే మేలైన దిగుబడులు వస్తాయని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ వివరించారు.

ఆకుమచ్చ తెగులు

సర్కోస్పొరా ఆకుమచ్చ తెగులు సోకితే ఆకులపై గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. వాటి మధ్య భాగం తెల్లగా, అంచులు ముదురు గోధుమ రంగులోకి మారుతాయి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆకులతో పాటు కాయలపై కూడా కనిపిస్తుంది. ఆకులపై ముదురు గోధుమ రంగులో గుండ్రని లేదా ఓ ఆకారమంటూ లేని పెద్ద మచ్చలు ఏర్పడుతాయి. నల్లని శిలీంధ్ర బీజాలు కప్పేయడం వల్ల కాయలు రాలిపోతాయి. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు సోకితే ఆకులు, కాయల మీద మచ్చలు ఏర్పడుతాయి. ఇవి తొలుత చిన్నవిగా, నీటి మచ్చలుగా ఉండి ఆ తర్వాత గోధుమ రంగులో, పసుపుపచ్చని వలయాలతో కనిపించి క్రమేపీ పెద్దవి అవుతాయి. ఆ దశలో అవి నల్లని గ్రీజు మచ్చలుగా కనిపిస్తాయి. ఎకరాకు 200 లీటర్ల నీటిలో 600 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, 40 గ్రాముల ప్లాంటామైసిన్, పోషామైసిన్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

కాయకుళ్లు తెగులు..

చలి వాతావరణంలో కొమ్మ ఎండుకాయ కుళ్లు తెగులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. తెగులు కారణంగా ముదురు కొమ్మల బెరడుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కొమ్మలు పై నుంచి కిందివరకు ఎండుతాయి. పండు కాయల మీద నల్లని మచ్చలు ఏర్పడి సహజ రంగును కోల్పోయి వరిగడ్డి, తెలుపు రంగులో కన్పిస్తాయి. అందుకే దీనిని మజ్జిగ తెగులు అంటారు. దీని నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 200 మిల్లీలీటర్ల ప్రొపికొనజోల్, అజాక్సిస్ట్రోబిన్ లేదా 100 మిల్లీలీటర్ల డైఫెన్‌కొనజోల్ లేదా 600 గ్రాముల పైరాకొలస్ట్రోబిన్-మిటిరం లేదా 400 గ్రాముల ప్రొపినెబ్ కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు..

వాతావరణంలో మంచుతో కూడి చలి ఎక్కువగా ఉన్నప్పుడు బూడిద తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తెగులు సోకిన మొక్కకు అడుగున తెల్లటి బూడిదరంగు మచ్చలు ఏర్పడుతాయి. క్రమేపి ఆకుల పైభాగానికి కూడా వ్యాప్తి చెంది ఆకులు పండు బారి రాలిపోతాయి. తెగులు సోకిన మొక్కలు పూత పట్టవు, పట్టిన పూతకూడా రాలిపోతుంది. వీటి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా కెరాథేన్ 1 మి.లీ. లేదా బెనోమిల్ 2 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో పంట మీద రెండుసార్లు పిచికారీ చేయాలి.

పంటను ఆశించే కీటకాలు

పూత ఈగ..

ఈ పూత ఈగ దోమ జాతికి చెందింది. పూత, పిందెలను ఆశిస్తే పిందెలు సరిగా పెరగక గిడసబారి లేదా ఎర్రబారి లేదా సైజు తగ్గడం జరుగుతుంది. కాయల సమయంలో సంక్రమిస్తే వంకరటింకరగా కాస్తాయి. వీటిలో గింజలు ఏర్పడవు. కాయను తెరిచి చూస్తే అందులో సుప్తావస్థలోని ప్యూపాలు, లార్వాలను గమనించవచ్చు. ఎకరాకు 250 మి.లీ ట్రైజోఫాస్‌ను పిచికారీ చేసి వారంరోజులకు 500 మి.లీ క్లోరిఫైరిఫాస్ లేదా 400 మి.లీ కార్బోసల్ఫాన్‌ను పిచికారీ చేసి నష్టాన్ని తగ్గించు కోవచ్చు.

పేనుబంక..

పేనుబంక పురుగు లేత కొమ్మల, ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చడం ద్వారా కాయ పెరుగుదల తగ్గుతుంది. తియ్యాటి పదార్థాన్ని విసర్జించటం వల్ల చీమల్ని ఆకర్షిస్తుంది. ఆకులు, కాయలు నల్లటి మసిపూసి నట్లుగా మారిపోతాయి. దీని నివారణకు మిథైల్ డెమోటాన్ 2 మి.లీ లేదా ఎస్సేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు..

కాయతొలుచు పురుగుల్లో పొగాకు లద్దెపురుగు, శనగ పచ్చపురుగు, పచ్చరబ్బరు పురుగులు ఉంటాయి. ఇవి మొదటిదశలో ఆకులను నష్టపరిచి తర్వాత కాయల్లో చేరి గింజలు తినేస్తాయి. దీంతో పంటకు విపరీతమైన నష్టం కలుగుతుంది. దీని నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా ఎస్సేట్ 1.5 గ్రాములు లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి అవసరం మేరకు పిచికారీ చేయాలి.

పరిశోధిస్తే ఫలితాలెన్నో..


ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్


ఇటీవల గుర్తించిన షటిల్‌కాక్ మష్రూమ్

- అరుదైన జీవజాతులకు నిలయం కవ్వాల్ టైగర్‌జోన్
- గతంలో అరుదైన కప్ప, నేడు షటిల్‌కాక్ మష్రూమ్

కడెం: అరుదైన జీవజాతులకు నిలయం కవ్వాల్ టైగర్‌జోన్ గతంలో అరుదైన కప్పను చూపించిన ఈ ప్రాంతం తాజాగా షటిల్‌కాక్ మష్రూమ్‌లను పరిచయం చేసింది. కడెం నది పరీవాహకంలోని అటవీ ప్రాంతంలో ప్రకృతి వింతలతో పాటు ఇంకా ఈ అడవుల్లో పరిశోధిస్తే ఎన్నో కొత్త ఫలితాలు బయటి ప్రపంచానికి తెలుస్తాయి. ఇలాంటి అరుదైన జీవజాతులు అటవీ ప్రాంతంలో మరింత జీవవైవిధ్యానికి దోహద ం చేస్తాయని పరిశోధకులు పేర్కొంటున్నారు.

ఓయూ రీసెర్చ్ స్కాలర్ పరిశోధన..

హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఇమ్రాన్ సిద్ధిఖీ, ఓయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ సూరికూచి, సీసీఎఫ్ శరవణన్ సూచనలతో ఓయూ రీసెర్చ్ స్కాలర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హైటికాస్) ఉత్తర తెలంగాణ రీజియన్ రీజనల్ కోఆర్డినేటర్ అనగంధుల వెంకట్ పరిశోధన ప్రారంభించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇటీవలే రిజర్వ్ యొక్క గొప్ప మైకోలాజికల్ బయోడైవర్సిటీని డాక్యుమెంట్ చేయడానికి ఉద్దేశించిన 'శిలీంద్ర వైవిధ్యం'పై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. కడెం మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతంలో పరిశోధనలో అరుదైన ఫంగస్ షటిల్ కాక్ మష్రూమ్ గుర్తించబడింది. పుట్టగొడుగు జాతికి చెందిన ఈ అరుదైన షటిల్‌కాక్ మష్రూమ్ భారతదేశంతో పాటుగా బర్మా, ఇండోనేషియా, తదితర కొద్ది దేశాల్లో మాత్రమే గుర్తించబడింది. ఇది వరకు ఈ శిలీంద్రం పశ్చిమ కనుమల్లో తప్ప దేశంలో ఇతర ప్రాంతాల్లో లేదని, 1875లో బర్కిలీ, బ్రూమ్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు గుర్తించారు. మనదేశంలో 1932లో నరసింహన్ మైసూర్‌లో గుర్తించారు. ఆతర్వాత 2000 సంవత్సరంలో ముంబైలోని సంజీవ్‌గాంధీ నేషనల్ పార్క్‌లో ఈ పుట్టగొడుగును గుర్తించారని తెలిపారు.

అరుదైన కప్ప

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్‌లో అరుదైన కప్ప ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ ఈ ఏడాది కనిపించింది. జూన్ 18న కడెం మండలం ఉడుంపూర్ అటవీరేంజ్ పరిధిలోని దోస్తనగర్ అటవీప్రాంతంలో కల్లెడ డీఆర్వో ప్రకాశ్, ఎఫ్‌బీవో ప్రసాద్ దీనిని గుర్తించారు. 'కలౌల పుల్చ్రా' అనిపిలువబడే ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ మైక్రోహాలిడే కుటుంబంలో భాగమైన ఒక చిన్న ప్రత్యేకమైన ఉభయచర జీవి ఇది. గుండ్రని శరీరం విలక్షణమైన (గోధుమ, నారింజ, లేదా పసుపు) రంగు కలిగి ఉంటుంది. ఈ కప్పలు సాధారణంగా అడవుల నుంచి వ్యవసాయ భూములు, నీటి వనరులు ఉన్న చోట ఆవాసం ఏర్పర్చుకుంటాయి. ఈ కప్పల ప్రధాన ఆహారం కీటకాలని, ఇవి రాత్రి పూట సంచరిస్తూ జిగట నాలుకతో కీటకాలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయని, పగలు వీటిని గుర్తించడం కష్టమని పరిశోధకులు పేర్కొంటున్నారు.

పరిశోధిస్తే మరిన్ని..



తూర్పు కనుమలు, మధ్య భారతదేశంలో షటిల్‌కాక్ మష్రూమ్ ఇదే మొదటి గుర్తింపు. ఈ అరుదైన శిలీంద్రం కుళ్లుతున్న వృక్షాలు, మొక్కల కాండాలపై పెరుగుతుంది. ఈ అధ్యయనంలో వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థలలో అభివృద్ధి చెందుతున్న అనేక శిలీంద్ర జాతులు బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో పరిశోధిస్తే మరిన్ని అరుదైన మొక్కలు, జీవజాతులను గుర్తించవచ్చు.

– వెంకట్, ఓయూ రీసెర్చ్ స్కాలర్, హైటికాస్ ప్రతినిధి

డౌట్ అడిగినందుకు చితకబాదిన టీచర్

- కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

కోటపల్లి: తరగతి గదిలో ఉపాధ్యాయురాలు పాఠం చెబుతుండగా డౌట్ అడిగినందుకు విద్యార్థిని చితకబాదిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఇటీవల ఆదివాసీ విద్యార్థి సంఘాల నాయకులు సందర్శించగా విద్యార్థులు తమ బాధలను చెప్పుకున్నారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని గణితంలో పాఠం అర్థం కాక మళ్లీ ఒకసారి చెప్పండి మేడం అనగానే సదరు ఉపాధ్యాయురాలు విద్యార్థిని చితకబాదినట్లు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు కింద ప్రభుత్వంకు చెల్లించేందుకు సుమారు రూ.125 ఉండగా ఈ పాఠశాలలో మాత్రం సదరు ఉపాధ్యాయురాలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.400 వసూలు చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇలా కోటపల్లి ఆశ్రమ పాఠశాలలో ఎన్నో సమస్యలు రాజ్యమేలుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ను వివరణ కోరగా విద్యార్థిని కొట్టిన విషయం తెలుసుకుని సదరు ఉపాధ్యాయురాలిని మందలించి ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్ష ఫీజు రూ.400 అనేది కొంతమంది వద్ద మాత్రమే ఇతరత్రా ఖర్చులకు తీసుకున్నారని తెలిసింది.

ఇందారం రోడ్డు ప్రమాదంపై సీఐ విచారణ


విచారణ చేపడుతున్న సీఐ వేణుచందర్

జైపూర్: ఇందారం బస్టాండ్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన సుంకరి మల్లయ్య మృతి చెందాడు. ఘటనపై శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆదివారం విచారణ చేపట్టారు. ఇందారం వద్ద సెంట్రల్ లైటింగ్ ఉండి కూడా పవర్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రాత్రి సమయంలో ఇక్కడ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. పశువులు రోడ్లపై సంచరిస్తుండడంతో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బస్టాండ్ వద్ద లైటింగ్‌తో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు హెచ్‌కేఆర్ మేనేజర్ రామకృష్ణను పిలిపించి మాట్లాడారు. హెచ్‌కేఆర్ కంపెనీ నిర్లక్ష్యం మూలంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, లేనిపక్షంలో కంపెనీపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.





మొక్కజొన్నపై అడవిపందుల దాడి


ధ్వంసమైన మొక్కజొన్న చేను

బోథ్: మండలంలోని బోథ్(బి) శివారులో రజిని అనే మహిళా రైతుకు చెందిన మొక్కజొన్న చేనులో శనివారం రాత్రి అడవిపందులు దాడులు చేసి పంటను ధ్వంసం చేశాయి. దాదాపు రెండెకరాల్లో పంటను ధ్వంసం చేసినట్లు బాధిత రైతు వాపోయింది. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

కంది పంట దగ్ధం


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సంగెపు బొర్రన్న

బజార్‌హత్నూర్: మండలంలోని కిన్నరపల్లిలో టోంపే సునీల్‌కు చెందిన కంది పంట ఆదివారం దగ్ధమైంది. సదరు రైతు తనకున్న ఐదెకరాల్లో కందిపంట సాగు చేశాడు. పంట కోతకు రావడంతో గత వారం కోసి మెదళ్లను కల్లంలో కుప్పగా పెట్టాడు. అర్ధరాత్రి పంటకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో సుమారు 20 క్వింటాళ్ల కందులు బూడిదయ్యాయని బాధిత రైతు వాపోయాడు. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పంటకు నిప్పుపెట్టిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట రైతులు తుకారాం, మురళి, సురేష్, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ప ట్టుకున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన నడిపి రాజన్న ఇంట్లో ఆదివారం తనిఖీలు నిర్వహించగా 6 క్వింటాళ్ల రేషన్ బి య్యం పట్టుబడ్డాయి. అనంతరం తదుపరి చ ర్యల నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు నివేదించినట్లు ఆమె తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న మారుతి వ్యాన్

బోథ్: మండలంలోని సొనాల గ్రామ సమీపంలో ఓ ప్యాసింజర్ వాహనం చెట్టును ఢీకొట్టింది. ఆదివారం చింతలబోరి నుంచి సొనాలకు బయలుదేరిన మారుతి వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటన సమయంలో వాహనంలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహన చోదకునికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

సెమీఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు


సెమీఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు

మంచిర్యాలటౌన్: అండర్-14 విభాగంలో హైదరాబాద్‌లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు క్వార్టర్ ఫైనల్‌లో గెలిచి సెమీఫైనల్‌కు చేరిందని కోచ్ ప్రదీప్ తెలిపారు. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో సెయింట్ పీటర్ హైస్కూల్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సెయింట్ పీటర్ జట్టు 33.5 ఓవర్లలో 94 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం 95 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు కేవలం 22.3 ఓవర్లలో 95 పరుగులు చేసి విజయం సాధించింది. సోమవారం జరిగే సెమీఫైనల్‌లో సెయింట్ ఆండ్రోస్ జట్టుతో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తలపడుతుంది.

జాతీయ రహదారిపై ప్రమాదం

- బైక్ ఢీకొని నాలుగు మేకలు మృతి
- యువకుడికి తీవ్రగాయాలు


గాయాలపాలైన విక్రమ్

వాంకిడి: ద్విచక్ర వాహనం మేకలను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా నాలుగు మేకలు మృత్యువాతపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆసిఫాబాద్‌కు చెందిన మాలి విక్రమ్ వాంకిడి మండల కేంద్రంలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వాంకిడికి వెళ్తుండగా టోల్‌ప్లాజా సమీపంలో అడ్డువచ్చిన మేకలను ఢీకొట్టాడు. ఘటనలో నాలుగు మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. ఘటనపై ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందాల్సి ఉందన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


చికిత్స పొందుతున్న బాలుడు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం బాలుడిపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. ముధోల్ మండలంలోని తరోడ గ్రామానికి చెందిన గఫర్ తన కుటుంబంతో కలిసి దేగాం గ్రామ సమీపంలో గల ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. సమీపంలో అబ్దుల్ అమీర్ (3) ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు బాలుడిని చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

లోకేశ్వరం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపి న వివరాల ప్రకారం మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన దుంపల లక్ష్మణ్ (30)కు బాసర మండలంలోని మైలాపూర్‌కు చెందిన ప్రమీలతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న లక్ష్మణ్ నిత్యం మద్యం సేవించి ఇంట్లో భార్యతో గొడవపడేవా డు. దీంతో మూడునెలల క్రితం ప్రమీల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై శనివా రం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆ దివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.